VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 291

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

ఆదివారం 5 ఏప్రిల్ 2026




# సింధనూరులో శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్న మంత్రి లోకేష్

● కేంద్రమంత్రులు కుమారస్వామి, సంజయ్ సేథ్ తో కలిసి సైనిక్ స్కూల్ ను ప్రారంభించిన మంత్రి







**సింధనూరు,కలంకౌంటర్ :** కర్ణాటక రాయచూర్ జిల్లా సింధనూరులోని హోసల్లీ క్యాంప్ లో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ప్రారంభోత్సవ వేడుకలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణ శాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో కలిసి శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ ను ప్రారంభించారు. ముందుగా స్కూల్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు నిర్వాహకులు, స్థానిక తెలుగు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో బసవేశ్వర స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయ సైనిక్ స్కూల్ హాస్టల్ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి మంత్రి లోకేష్ ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సైనిక్ స్కూల్ తరగతి గదులను, సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన దివంగత డాక్టర్ దండమూడి రాధాకృష్ణ జ్ఞాపకార్థం పాఠశాల ప్రాంగణంలో నిర్మించిన డా.రాధాకృష్ణ కళాధామ పేరిట ఓపెన్ ఆడిటోరియంను వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్.డీ కుమారస్వామి, కేంద్ర రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ తో పాటు విశాఖ ఎంపీ శ్రీ భరత్, కర్ణాటక వైద్య విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్, కర్ణాటక కన్నడ, సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ ఎస్. తంగడగి, కర్ణాటక చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్ బోసురాజు, సింధనూరు ఎమ్మెల్యే హంపనగౌడ బాదర్లీ, శ్రీకృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ బి.వెంకటరావు, డైరెక్టర్లతో పాటు తో పాటు వివిధ పార్టీల నాయకులు, సింధనూరు స్థానిక తెలుగు ప్రజానీకం పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కీర్తికి మరో కిరీటం




**విశాఖపట్నం,కలంకౌంటర్ :** డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విశాఖపట్నం జోనల్ యూనిట్‌లో ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అంబటి కీర్తి నాయుడుకు విశిష్ట గౌరవం లభించింది. 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఆమె క్లిష్టమైన విధిని అత్యంత నైపుణ్యంతో, సమర్థవంతంగా నిర్వహించినందుకు గుర్తింపుగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆమెకు "కమెండేషన్ సర్టిఫికెట్ " అందజేశారు. కీర్తి నాయుడు తన విధుల్లో చూపిన ప్రతిభ, నిబద్ధత, బాధ్యతాయుతమైన సేవలను అధికారులు ప్రశంసించారు. ముఖ్యమైన కేసులను విజయవంతంగా నిర్వహించడం, సంస్థ ప్రతిష్టను పెంపొందించడం వంటి అంశాల్లో ఆమె పాత్ర విశేషంగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఇలాంటి ప్రశంసాపత్రాలు ఉద్యోగులు తమ విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, క్లిష్టమైన కేసులను సమర్థంగా పరిష్కరించినప్పుడు, సంస్థకు విశేష సేవలు అందించినప్పుడు, ఇతరులకు ఆదర్శంగా నిలిచే విధంగా పనిచేసినప్పుడు ప్రదానం చేయబడతాయి. ఈ సందర్భంగా సహచరులు, అధికారులు ఆమెకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# కోటయ్యకు ఆప్స్ వ్యవస్థాపకులు డా. కొల్లూరి చేయూత



**పెడన,కలంకౌంటర్ :** పెడన పట్టణ రామలక్ష్మి కాలనీకి చెందిన విశాలాంధ్ర రిపోర్టర్ పృద్వి కోటయ్య ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన డా. కొల్లూరి ఐదువేల రూపాయల విలువ గల ఊపిరితిత్తులు షుగరు వ్యాధికి సంబంధించిన మందులను ఉచితంగా అందజేసి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కోటయ్యను పరామర్శించి ఒక భరోసానిచ్చిన డా. కొల్లూరి ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత ఆశీస్సులతో త్వరగా కోటయ్య కోలుకోవాలని అన్నారు డా. కొల్లూరి. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు జల్లూరి రాంబాబు పాల్గొన్నారు.

# లక్ష్యాల మేరకు రాజధాని పనులు పూర్తి చేయాలి

● వేగం మరింత పెరగాలి... ఐకానిక్ ముద్ర కనిపించాలి ● నిర్మాణ సంస్థలు కడుతోంది కేవలం బిల్డింగులు కాదు... రాజధాని ● రాజధాని పనులకు గ్రీన్ ఛానెల్ ద్వారా ఇసుక, గ్రావెల్ ● ప్రభుత్వ శాఖలు, అధికారులు సమన్వయంతో జాప్యం లేకుండా చూడాలి ●-అమరావతి రాజధాని పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ● రాజధానిలో అగ్నిప్రమాదాలపై సీఎం అసంతృప్తి... నిర్మాణ సంస్థలదే బాధ్యతని స్పష్టం





**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి రాజధాని నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రధానితో ప్రారంభోత్సవం చేస్తామని.. ఈ మేరకు పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు అధికారులు కూడా పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజధాని నిర్మాణ పనులను ఓ కాంట్రాక్ట్ వర్క్ అన్నట్టుగా భావించవద్దని... చరిత్రలో భాగస్వాములు అవుతున్నట్టుగా భావించాలన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో రాజధానిలో నిర్మాణ పనులు చేపట్టిన వివిధ కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాజధానిలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు ఉండగా... వాటిల్లో రూ. 50, 943 కోట్ల పనులు గ్రౌండ్ అయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎల్పీఎస్ మౌళిక సదుపాయలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీఎం సమీక్షించారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో మొత్తంగా 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారని అధికారులు తెలిపారు. అలాగే ఏ నిర్మాణ సంస్థ ఎంత మేర పనులు చేసింది...లక్ష్యాన్ని ఎంత మేరకు చేరుకున్నారనే విషయంలో పనుల వారీగా సీఎం చర్చించారు. పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరు పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నిర్మాణ పనులకు అవసరమైన మ్యాన్ పవర్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కాంట్రాక్టర్లు సీఎం దృష్టికి తెచ్చారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా చాలా మంది కార్మికులు వెళ్లారని నిర్మాణ సంస్థ ప్రతినిధులు చెప్పారు. స్థానికంగా నైపుణ్యమున్న మ్యాన్ పవర్ ఎంత వరకు అందుబాటులో ఉంటుందో చూసి వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రాజధాని పనుల్లో ఎంత మెషినరీని వినియోగిస్తున్నారనే అంశం పైనా సీఎం ఆరా తీశారు. రాజధాని పనుల్లో 5,580 మెషినరీ అవసరముండగా... ప్రస్తుతం 3767 మెషనరీ ఉందని అధికారులు వివరించారు. ఇవి కాకుండా హాట్ మిక్స్ 16, వెట్ మిక్స్ మెషిన్లు 36, ఆర్ఎంసీ మిషన్లు 34 ఉన్నాయని తెలిపారు. వారం, నెల వారీగా టార్గెట్‌లు పెట్టుకుని రాజధాని పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను... నిర్దేశించుకున్న టార్గెట్లను విశ్లేషిస్తే... వారానికి రూ. 941 కోట్ల విలువైన పనులు పూర్తి కావాల్సి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే వర్షా కాలంలో



పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది కాబట్టి... ఆలోగానే చేపట్టాల్సిన పనులను జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఎక్కువ ప్రాజెక్టులను చేపడుతున్న నిర్మాణ సంస్థలు మరింతగా దృష్టిని కేంద్రీకరించి పనులు చేయాలన్నారు. రాజధాని నిర్మాణానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణమనేది కేవలం ఒక కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దు... ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములువుతున్నట్టే. నిర్మాణ సంస్థలుగా ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపాలి. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్టను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే.. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉంది... ప్రతీ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి ప్రారంభించుకోవాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యమెందుకు...?..**

సమీక్ష సందర్భంగా ఇటీవల రాజధాని ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదాల ఘటన ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణ సామాగ్రికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు లేదా అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయన్నారు. ఘటన జరిగిన తర్వాత కాంట్రాక్టు సంస్థలు కానీ... అధికారులు కానీ తగిన రీతిలో స్పందించలేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని వక్రీకరించేలా కొందరు రాజకీయం చేస్తున్నారని... ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. జరగరాని ఘటనలు జరిగితే వెంటనే అలెర్ట్ చేయాలని ఆదేశించారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా... ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు.. బురద జల్లేందుకు, కుట్రలు పన్నేందుకు కొందరు సిద్దంగా ఉన్నారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఆయా నిర్మాణ సంస్థలు కూడా ప్రాజెక్టు మేనేజర్లుగా సమర్ధులను నియమించుకోవాలని సూచించారు. సరైన వాళ్లని నియమించుకోకుంటే... ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందని.. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తాను అనుమతించనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా కలెక్టర్లకు ఆదేశాలు..** రాజధాని పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇసుక, గ్రావెల్ కొరత కారణంగా నిర్మాణ పనుల్లో జాప్యం జరిగే పరిస్థితి రాకూడదని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలో ఫారెస్ట్ అధికారుల కారణంగా గ్రావెల్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉందని.. జిల్లా కలెక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నా... ఫారెస్ట్ అధికారులతోనే అసలు సమస్య వస్తోందనే విషయం సమావేశంలో సీఎం దృష్టికి వచ్చింది. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్ వంటివి గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని.. ఎవరి ఒత్తిళ్లకూ గురి కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరైనా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మేరకు కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్లతో మాట్లాడాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజధానిపై జగన్ విధ్వంసం... అమరావతిపై చంద్రబాబు విజయం

● అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి రాష్ట్ర అభివృద్ధి ● జగన్ విధ్వంసానికి చెక్... అమరావతి జయభేరి ● పార్లమెంట్‌లో 50కి పైగా పార్టీల మద్దతు... వైసీపీ వాకౌట్ షాక్ ● అభివృద్ధి చేసిన చంద్రబాబు... అడ్డుకున్న జగన్ ● మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల్లో చిచ్చు ● విశ్వసనీయతపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు ● జగన్‌పై విరుచుకుపడ్డ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి/మంగళగిరి, కలంకౌంటర్ :** రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు చూస్తే జగన్ పాలన పూర్తిగా విధ్వంసానికి ప్రతీకగా నిలిచిందని, అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అమరావతి పునర్నిర్మాణం విజయపథంలో దూసుకెళ్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడం ప్రభుత్వం బాధ్యత అని, గత వారం రోజులుగా 5 కోట్ల మంది ప్రజలు ఆనందోత్సవాలతో పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో పార్లమెంట్, రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య రామమందిరం, జీఎస్టీ, వక్ఫ్ బిల్లు సవరణ, మతమార్పిడి వ్యతిరేక చట్టాలు వంటి అనేక అంశాలపై రాజకీయ పార్టీల మధ్య విభేదాలు వచ్చినా ఎక్కడా ఏకాభిప్రాయం రాలేదని అన్నారు. అయితే అమరావతి చట్టబద్ధత విషయంలో దేశంలోని 50కి పైగా రాజకీయ పార్టీలు మద్దతు తెలపగా కేవలం వైసీపీ మాత్రమే వ్యతిరేకించి పార్లమెంట్‌లో వాకౌట్ చేసిందని విమర్శించారు. తెలుగు జాతి రాజధాని అమరావతిపై జగన్మోహన్ రెడ్డికి ఉన్న కక్ష చరిత్ర చూస్తే అర్థమవుతుందని, చంద్రబాబు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా 5 కోట్ల మంది ఆంధ్రుల అభివృద్ధినే దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన సమయంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నష్టం జరగకుండా చివరి నిమిషం వరకు పోరాడిన నాయకుడు చంద్రబాబేనని గుర్తుచేసి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని విడదీసి ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాంతాలు, వర్గాల మధ్య విభేదాలు రాకుండా అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకొచ్చి, హైదరాబాద్‌లో 13 గంటల పాటు ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి అందరి అభిప్రాయంతోనే అమరావతిని రాజధానిగా ప్రకటించారని తెలిపారు. ఆ సమయంలో వైసీపీ కూడా అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపిందని, "ఇక్కడే ఇల్లు కట్టుకుంటాను, రాజధానిని మార్చను" అన్న జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చి అమరావతిని శ్మశానం, ఎడారి అంటూ దూషించారని, ఒక జాతి, కులంపై నీచ వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. అమరావతిలో అవినీతి జరిగిందని ఆరోపించినా ఒక్కటి కూడా నిరూపించలేకపోయారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టారని, విశ్వసనీయత గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదని, రాజధాని విషయంలో తొమ్మిది సార్లు మాట మార్చారని విమర్శించారు. అమరావతిని నమ్మి 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని, ఇది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ కావడంతో ప్రభుత్వ ఖజానా నుంచి రూపాయి ఖర్చు అవసరం లేదన్నారు. 2014--2019 మధ్య టీడీపీ హయాంలో 54 వేల కోట్లతో ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేశామని, కానీ 2019లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల మయం చేసి అభివృద్ధిని పాతరేసారని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 18 నెలల్లోనే జగన్ చేసిన విధ్వంసాన్ని సరిచేసే పనులు ప్రారంభించి అమరావతి అభివృద్ధి, భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్ట్ నిర్మాణం, కొత్త పెట్టుబడులు తీసుకువస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ డయాఫ్రం వాల్‌ను 18 నెలల్లో పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేస్తామని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను 13 వేల కోట్లతో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని చెప్పారు. రాయలసీమలో లిఫ్ట్ ఇరిగేషన్ ఆగిపోయిందని అబద్ధాలు చెప్పిన వైసీపీని తప్పుబట్టి, 18 నెలల్లోనే సీమలో 2,200 కోట్లతో పనులు చేపట్టి కుప్పం వరకు నీరు తీసుకువచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజల ఆనందాన్ని చెడగొట్టేందుకు "మావిగన్" అనే కొత్త నాటకంతో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, జగన్‌కు వైసీపీలోనే మద్దతు లేదని, ప్రజలు ప్రశ్నిస్తే రాజకీయాల్లో ఉండలేరని హెచ్చరించారు. అమరావతి తెలుగు ప్రజల భవిష్యత్తు అని స్పష్టం చేసిన అచ్చెన్నాయుడు, అమరావతిని ఆర్థిక శక్తిగా మార్చి అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు.



బదిలీ పై వెళుతున్న ట్రైనీ కలెక్టర్ రఘువంశీ దంపతులను సన్మానిస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య

-తిరుపతి,కలంకౌంటర్ :

# జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలిచిన ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోనా



**పెదకూరపాడు,కలంకౌంటర్ :** ఆర్యవైశ్య జర్నలిస్ట్ కుటుంబ సభ్యుడు పెదకూరపాడు నియోజక వర్గంకు చెందిన ఒక పాత్రికేయుడు కుమార్తెకి అవసరమైన వైద్య ఖర్చు నిమిత్తం.. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి కుమార్ విజ్ఞప్తి మేరకు అవసరమైన తమ వంతు సహకారాన్ని కోనా శ్రీనివాసరావు (5000 రూపాయలు) అందజేశారు. కోనా శ్రీనివాసరావు కి రాష్ట్ర అధ్యక్షులు , జర్నలిస్టుల సంక్షేమ సంఘం వారి కుటుంబ సభ్యులందరూ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పూటకో ఒక మాట మార్చే వ్యక్తి జగన్

● జగన్ వైసీపీ నేతలు తీరుతో ఈసారి ఆ పార్టీకి 11 సీట్లు కూడా రావు. ● పెనుకొండలో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ. ● పూల మార్కెట్ ప్రారంభించిన మంత్రి సవిత.






**శ్రీ సత్యసాయి జిల్లా,పెనుకొండ,కలంకౌంటర్ :** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవిత తెలిపారు. ఈ సందర్భంగా రూ.40 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఘనగిరి పూల మార్కెట్‌ను ప్రారంభించారు.మంత్రి సవిత మాట్లాడుతూ, చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు రూ.6 లక్షలతో పూల మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించేందుకు రూ.50 లక్షలతో శానిటేషన్ సెంటర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. త్వరలోనే రూ.5 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.ఇంకా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మడకసిర రోడ్ వరకు కూడా సెంటర్ లైటింగ్ ను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, పెనుకొండ నియోజకవర్గానికి మరింత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి సవిత జగన్‌పై విమర్శలు చేశారు. గంటకో మాట మార్చే వ్యక్తి జగన్ అని, పార్టీ ఉనికికోసమే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలోని అన్ని పార్టీలూ అమరావతికి మద్దతు పలికినా, వైసీపీ మాత్రమే మద్దతు ఇవ్వలేదని అన్నారు.అమరావతి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురిచేసిన కారణంగా వైసీపీకి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, వచ్చే ఎన్నికల్లో గతంలో వచ్చిన సీట్లు కూడా రావని వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు ఒకలా, ఓడినప్పుడు మరోలా వ్యవహరించే వ్యక్తి జగన్ అని విమర్శించారు.రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకిగా వ్యవహరిస్తున్నారని, ప్రజల ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల వైసీపీ అధికారంలోకి రావడం కేవలం కలగానే మిగిలిపోతుందని మంత్రి సవిత పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఒడిస్సా నుండి విశాఖకు గంజాయిని తరలిస్తున్న నిందితుల అరెస్ట్

● రూ.10లక్షల విలువ గల 55 కిలోల గంజాయి, ఒక కారు, ఒక స్కూటీ, మూడు సెల్ ఫోన్ లు స్వాధీనం ● జిల్లా ఎస్పీ ఎ ఆర్ దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లా ఎల్.కోట పోలీసులకి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ఒడిస్సా నుండి విశాఖపట్నం కారులో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 25 ప్యాకెట్లలోగల 55 కిలోల గంజాయిని, ఒక కారు, మూడు సెల్ ఫోన్లు మరియు ఒక స్కూటీని స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండుకు తరలిస్తున్నట్లుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - ఎల్.కోట పోలీసులకు రాబడిన ఖచ్చితమైన సమాచారంతో ఏప్రిల్ 4న ఎల్.కోట మండలం, రంగరాయపురం జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టి, ఒడిస్సా నుండి విశాఖపట్నంకు కారులో గంజాయిని తరలిస్తున్న (ఎ-1) అల్లూరి సీతారామరాజు జిల్లా, అరుకు మండలం, బోసుబెడ్డ గ్రామానికి చెందిన సోనై రాజబాబు (34సం.లు) అనే వ్యక్తిని, పోలీసులకు చిక్కకుండా కారుకు పైలట్ గా స్కూటీ పై వెళ్ళుతున్న (ఎ-2) ఒడిస్సా రాష్ట్రం, కోరాపుట్ జిల్లా, పాడువ మండలం, హట్టగూడ గ్రామానికి చెందిన నంజయ్ హంతల్ (46 నం.లు), (ఎ-3) ఒడిస్సా రాష్ట్రం, పూరి జిల్లా, తలజంగా, మధుబనబాలియ గ్రామానికి చెందిన సంజీబ్ కుమార్ మహంతి (40సం.లు)లను అదుపులోకి తీసుకొని, వారి వద్దనుండి 25 ప్యాకెట్లలోగల రూ.10 లక్షల విలువ గల 55 కిలోల గంజాయి, ఎపి 31 ఎఎస్ 7207 నంబరుగల కారు, ఎపి 39 బిడబ్ల్యు 2903 నంబరుగల స్కూటీ మరియు మూడు సెల్ ఫోన్లను సీజ్ చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. విచారణలో పట్టుబడిన ముగ్గురు నిందితులు గంజాయిని ఒడిస్సా రాష్ట్రంలో కొనుగోలు చేసి విశాఖపట్నం తరలిస్తున్నట్టుగా గుర్తించామన్నారు. వీరిలో (ఎ-1) రాజబాబుపై పెందుర్తి, గాజువాక, అరుకు పోలీసు స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. అరెస్టు కాబడిన నిందితులను రిమాండుకి తరలిస్తున్నామని, వీరిపై ఫైనాన్సియల్ ఇన్విస్టిగేషను, పిట్ ఎన్.డి.పి.ఎస్. చట్టం ప్రకారం దర్యాప్తు చేస్తామని, పి.డి.చట్టంను కూడా ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసామని, గంజాయి అక్రమ రవాణకు కారకులైన, బాధ్యులైన ఒడిస్సాకు చెందిన పింకూ, దాదా అనే మరో ఇద్దరు నిందితులుగా గుర్తించామని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసుశాఖ, ఈగల్ టీమ్స్, ఈగల్ టాస్క్ ఫోర్సు కూడా పని చేస్తున్నాయన్నారు. గంజాయి నియంత్రణకు ప్రజలు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని, గంజాయి రవాణ, వినియోగం, విక్రయం గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే 1972 లేదా డయల్ 112/100కు సమాచారం అందించాలన్నారు. జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గంజాయి గురించిన సమాచారం ఇవ్వడం లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే, వారి కుటుంబాలను కూడా గంజాయి నాశనం చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. కావున, ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని వెంటనే స్థానిక పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలన్నారు. ఈ కేసులో నిందితులను అరెస్టు, గంజాయిని సీజ్ చేయుటలో క్రియాశీలకంగా పని చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని, ఈగల్ టాస్క్ ఫోర్సు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్.కోట రూరల్ సర్కిల్ సిఐ ఎల్.అప్పల నాయుడు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఎల్.కోట ఎస్ఐ సి.హెచ్.నవీన్ పడాల్ ,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు చేయూత

● స్వయం ఉపాధికి సరికొత్త మార్కెటింగ్ ● మహిళా పారిశ్రామికవేత్తలకు షాపింగ్ మాల్స్ భరోసా ● సామాజిక బాధ్యతగా తొలి అడుగు వేసిన ఎల్ఈపీఎల్ ● ఎన్‌టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ




**విజయవాడ, కలంకౌంటర్ :** మహిళల ఆర్థిక స్వావలంబనను బలోపేతం చేయడానికి, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందుతున్న మహిళలకు మార్కెటింగ్ రంగంలో కొత్త అవకాశాలు కల్పించే దిశగా ఎన్‌టీఆర్ కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ చొరవతో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానికంగా తయారు చేస్తున్న హస్తకళా ఉత్పత్తులు, ఇతర స్వయం ఉపాధి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అందించేందుకు షాపింగ్ మాల్స్‌లో ప్రత్యేక స్థలాలను కేటాయించడం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించే కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం నగరంలోని ఎంజీ రోడ్డులోని ఎల్ఈపీఎల్ సెంట్రో షాపింగ్ మాల్‌లో అయిదుగురు మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చేలా కేటాయించిన స్టాళ్లను కలెక్టర్లు లక్ష్మీశ, డీకే బాలాజీ ప్రారంభించారు. మహిళల స్వయం ఉపాధి ఉత్పత్తులను పరిశీలించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను విజయవంతంగా ముందుకు నడిపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరవేసుకునే అవకాశం పొందుతారని, మధ్యవర్తుల అవసరం తగ్గి వారికి అధిక ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. ఆధునిక మార్కెటింగ్ పద్ధతులు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వంటి అంశాలపై కూడా వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా ఎల్ఈపీఎల్ సంస్థ ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి మద్దతు అందించడం విశేషమని తెలిపారు. ఈ తరహా భాగస్వామ్యాలు మహిళల అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ద్వారా ఇప్పటికే వివిధ శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని.. ఇప్పుడు మార్కెటింగ్ పరంగా చేయూతనిస్తున్నట్లు వివరించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్వయం ఉపాధి రంగంలో ఉన్న మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాలను మరింత విస్తరించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు మార్కెట్ లింకేజీలు కల్పించడం ద్వారా స్థిరమైన ఆదాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఈపీఎల్ సీఈవో కె.కృష్ణకుమార్, ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, కృష్ణా డీఆర్‌డీఏ పీడీ వై.హరిహరనాథ్, యూసీడీ పీవో ఎం.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒలింపియాడ్ లో కొమ్మారెడ్డి కి స్టేట్ ర్యాంక్ లు




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** రాజమండ్రి ఎడ్యుకేషన్ స్పెషల్, రాజమండ్రి వారు గోదావరి సైన్స్ & మాథ్స్ ఒలింపియాడ్ ప్రిలిమనరీ పరీక్షలో సెలెక్ట్ అయిన విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 2026 లో మెయిన్స్ పరీక్షను నిర్వహించారు.. ఈ ఒలింపియాడ్ ఫలితాలను శుక్రవారం సాయంత్రం తరగతుల వారీగా ప్రకటించడం జరిగిందనీ,ఈ ఫలితాలలో బంటుమిల్లి కొమ్మారెడ్డి విద్యార్థులు వివిధ విభాగాలలో రాష్ట్ర స్థాయి పతకాలను సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థుల వివరాలు కిషోర్ విడుదల చేశారు. తమ్ము. అనన్య (3 వ తరగతి) -- 3 వ తరగతి విభాగంలో రాష్ట్ర స్థాయి 7వ ర్యాంక్ యస్. అఫషా పర్వీన్ (7 వ తరగతి) - 7 వ తరగతి విభాగంలో రాష్ట్ర స్థాయి 2వ ర్యాంక్ బి. కళ్యాణ్ (9 వ తరగతి) -- 9 వ తరగతి విభాగంలో రాష్ట్ర స్థాయి 5 వ ర్యాంక్ జి. జ్ఞాన ప్రజ్వల్ (10 వ తరగతి) - 10 వ తరగతి విభాగంలో రాష్ట్ర స్థాయి 6 వ ర్యాంక్ ఇంతటి అద్భుత ప్రతిభ కనబరచిన ఈ విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ శ్రీ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రెటరీ మరియు కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ , కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య , డైరెక్టర్ & వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరిణి , స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.శ్రీనివాసరావు , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు.

# సైన్సు సెంటర్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేయండి...

● పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయండి... ● నియోజకవర్గం సమీక్షలో అదికారులతో ఎమ్మెల్యే సుజనా చౌదరి .




**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతి పై ఎమ్మెల్యే సుజనా చౌదరి సమీక్ష నిర్వహించారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ తరపున నియోజకవర్గ అభివృద్ధి బృంద సభ్యులు, సుజనా ప్రాజెక్ట్స్ టీం తో కలసి సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రతిపాధిత అభివృద్ధి పనుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. వివిధ పనులు ఆలస్యం కావడానికి కారణాలను తెలపాలని , ప్రభుత్వం తరపున పెండింగ్ ఉంటే తాను మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు. అదే విధంగా ప్రజల వద్ద నుంచి వచ్చిన అర్జీల పరిష్కార నివేదికలను పరిశీలించారు. భవానీపురంలో ఉన్న సైన్సు సెంటర్ ను మరింత విస్తృత పర్చేందుకు అవసరమైన ప్రతిపాధనలు, ప్రణాళికల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీ కాస్ట్ (సైన్సు సెంటర్) సీఈఓ శరత్, పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆ ప్రాంగణంలో ఒక థియేటర్, గ్రంథాలయం, తదితరం నిర్మాణాలకు సంబందించిన ప్రతిపాదనలు చెప్పారు.

# ఎన్నికల వార్డుల విభజన ప్రక్రియ అప్రమత్తంగా చేపట్టండి

● ఏప్రిల్ 10 నుండి 16 వరకు ప్రజల అభిప్రాయాలు తెలియజేయవచ్చు. ● కమిషనర్ ఎన్.మౌర్య.




**తిరుపతి,కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తిరుపతి నగరంలో పెరగనున్న ఎన్నికల వార్డుల విభజన, పెంపు ప్రక్రియను అప్రమత్తంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో జనాభా ప్రాతిపదికన ఎన్నికల వార్డుల విభజన, పెంపుపై నగరపాలక సంస్థ రెవిన్యూ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, స్వర్ణ వార్డు కార్యదర్శులతో శనివారం కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్ లలో జనాభాకు అనుగుణంగా ఎన్నికల వార్డుల సంఖ్య పెంచేందుకు ఏప్రిల్ 1 తారీఖున జీవో విడుదల చేసిందని తెలిపారు. ఆ మేరకు తిరుపతి నగరపాలక సంస్థలోని 50 వార్డులను 66 వార్డులకు పెంచేలా నిర్ణయించారని తెలిపారు. ఈ వార్డుల విభజన, పెంపు ప్రక్రియ లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నెంబర్లు, జనాభా, తదితర వాటిని ప్రామానికంగా జాగ్రత్తగా పరిశీలించి విభజన చేయాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ లోపు వార్డుల విభజన ప్రక్రియ ముసాయిదా సిద్ధం చేయాలని తెలిపారు. వార్డులను విభజించే ప్రతిపాదనను ఫారం 1 ద్వారా 10 వ తేదీ నుండి 16 వ తేదీ వరకు నగరపాలక సంస్థ నోటీసు బోర్డు, ఇతర ప్రకటనల ద్వారా ప్రజల అభ్యంతరాల కొరకు ఉంచాలని తెలిపారు. 25 వ తేదీ లోపు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఎన్నికల వార్డుల విభజన ప్రతిపాదనలను ఖరారు చేసి, మున్సిపల్ పరిపాలన కమిషనర్ & డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు. మే రెండవ తేదీ లోపు ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను, మున్సిపల్ కార్పొరేషన్ యొక్క అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తరువాత, మున్సిపల్ పరిపాలన కమిషనర్ & డైరెక్టర్ చేత మున్సిపల్ కార్పొరేషన్ యొక్క వార్డు విభజన ప్రతిపాదనలకు ఆమోదం తెలపడం జరుగుతుందని తెలిపారు. మే 5వ తేదీ లోపు కమిషనర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ఫారం 6 లో తుది నోటిఫికేషన్ ప్రచురణ చేయడం జరుగుతుందని తెలిపారు. అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డిసిపిలు ఖాన్, దేవి కుమారి, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, ఏసీపీలు పార్వతి ప్రియ, మూర్తి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా శ్రీ సీతారాముల ఎదుర్కోల కార్యక్రమం



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని పెద్ద బజారు ఆనందం ఉన్న శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఎంతో వైభవంగా శ్రీ సీతారాముల ఎదుర్కోల కార్యక్రమం జరిగింది. ఆదివారం రాత్రి గజ వాహనంపై శ్రీరామచంద్రుడు ఊరేగుతూ మురారి శెట్టి స్వామి ఇంటి వద్దకు చేరుకున్నారు. శనివారం ఉదయం శ్రీ కోదండ రామాలయంలో నుంచి సీతమ్మ అమ్మవారిని రథం పై ఊరేగించుకుంటూ రామయ్య వద్దకు ఉభయ దాతలైన మురారిశెట్టి స్వామి కుటుంబ సభ్యులు, భక్తులు తీసుకుని వచ్చారు. టీటీడీ వేద పండితులు శ్రీమాన్ గుడివర్తి అనంత వెంకట దీక్షితులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అనిల్ స్వామి, పవన్ స్వామి ఎదుర్కోల కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. ఎదుర్కోల కార్యక్రమంలో గుంటూరు అగ్రహారానికి చెందిన గోగంటి అప్పలాచార్యులు వారు సీతారాముల గొప్పతనాన్ని గూర్చి చేసిన వ్యాఖ్యానం భక్తులను పరవశింపజేసింది. అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా రామాలయానికి చేరుకొని స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాసులు, ఉభయ దాత మురారిశెట్టి స్వామి కుటుంబ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



# తిరుమల పవిత్రతను కాపాడాలి

**• టిటిడి ఛైర్మన్ ను తొలగించాలి • వెలంపల్లి శ్రీనివాసరావు**






**విజయవాడ,కలంకౌంటర్ :** తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడాలని ,భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న ప్రస్తుత టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడును వెంటనే పదవి నుండి తొలగించాలని కోరుతూ మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు వైసీపీ శ్రేణులతో కలిసి నేడు ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం విద్యాధరపురంలోని మువ్వల వారి వీధిలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఛైర్మన్ బి.ఆర్. నాయుడు ప్రవర్తన, ఆయనకు సంబంధించిన వివాదాస్పద అంశాలు సాక్షాత్తు కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి పవిత్రతను మంటగలుపుతున్నాయన్నారు. ఛైర్మన్ వ్యవహారశైలి, ఆయనపై వస్తున్న ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలోని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండటం దారుణమని పేర్కొన్నారు. బి.ఆర్. నాయుడు గతంలో ఒక మహిళతో ఉన్న వీడియో ఫుటేజీల బయటకు వచ్చాయని, సదరు మహిళ 2024 ఎన్నికల ముందే సాక్షాత్తు తెలుగుదేశం పార్టీ ఆఫీసులో చంద్రబాబు నాయుడికి లేఖ రాసి బి ఆర్ నాయుడు దుర్మార్గుడని అలంటి వ్యక్తిని చేరతీయవద్దని లేఖలో ఆమె పొందుపరిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అటువంటి దుర్మార్గుడిని, హిందూ ధర్మంపై కనీస అవగాహన లేని వ్యక్తిని పవిత్రమైన టిటిడి ఛైర్మన్ పీఠంపై ఏ ప్రాతిపదికన కూర్చోబెట్టారని ప్రశ్నించారు. గతంలో జరగని తప్పులకు పశ్చాత్తాప దీక్షలు చేసిన పవన్ కళ్యాణ్, ఇప్పుడు కళ్ళముందే ఇన్ని అపచారాలు జరుగుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీసారు. తిరుమలలో భక్తులు వీడియోలు తీస్తే కేసులు పెడుతున్న ప్రభుత్వం, సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్కడ రీల్స్ చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికారం శాశ్వతం కాదని, వేంకటేశ్వర స్వామి పవిత్రతతో ఆడుకుంటే స్వామి వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. తక్షణమే బి.ఆర్. నాయుడిని ఛైర్మన్ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఈ అపచారాలకు నిరసనగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున స్వామి వారికి మొరపెట్టుకున్నట్లు వెల్లడించారు. పరమ పవిత్రమైన తిరుమల ప్రతిష్టను భంగం కలిగించేలా ప్రస్తుత ఛైర్మన్ బి.ఆర్. నాయుడు అనుసరిస్తున్న తీరు, ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరుస్తున్నాయని మండిపడ్డారు. పవిత్రమైన దేవస్థానాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చడం తగదని, ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని ఆయన విమర్శించారు. తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భక్తుడిపై ఉందని, అందుకే స్వామివారిని వేడుకుంటూ ఈ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు వెలంపల్లి తెలిపారు. తక్షణమే బి.ఆర్. నాయుడుని ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు ఎండి రుహుల్లా, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు , పార్టీ శ్రేణులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మహాసభ ప్రధాన కార్యదర్శి మాటూరి రంగనాథ్ కు నేడు సన్మానం



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా నియమితులైన మాటూరి రంగనాథ్ కు కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం (నేడు ) ఉదయం 8 గంటలకు వాసవి భవన్ లో సన్మాన సభ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్ తెలిపారు.ఎంతో చరిత్ర కలిగిన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ లో కీలకమైన పదవి జిల్లాకు చెందిన సేవాభావం ఉన్న మాటూరి రంగనాథ్ ను వరించడం ఆనందించదగిన విషయం అన్నారు.పదవులు కోసం కాకుండా సమాజానికి అవకాశం ఉన్నంతవరకు మేలు చేసే దిశగా అడుగులు వేస్తున్న రంగనాథ్ రియల్ ఎస్టేట్ రంగంలో తో పాటు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం ప్రశంసనీయం అన్నారు.జిల్లాలో ఉన్న ఆర్యవైశ్య నాయకులు ఈ కార్యక్రమం లో పాల్గొని విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి సాయి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.


# ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ , ఎం ఎల్ ఎ





**బాపట్ల,కలంకౌంటర్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 9న బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో, శనివారం జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ జిల్లా అధికారులతో కలిసి భట్టిప్రోలు, కొల్లూరు మండలాల పరిధిలో సభ వేదిక, హెలిప్యాడ్ లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. ఎస్పీ తో పాటు వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్క ఆనందబాబు పాల్గొన్నారు. హెలిప్యాడ్, సమావేశ ప్రదేశాల కోసం భట్టిప్రోలు మండలంలోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న సూరేపల్లి గ్రామ పరిధిలో, కొల్లూరు మండలంలోని చినపులివర్రు గ్రామ పరిధిలో ఇతర పలు ప్రదేశాలను పరిశీలించారు. స్వయంగా డ్రోన్ ఎగురావేసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ ఏ.శ్రీనివాసరావు, ఆర్డీవో శ్రీదేవి, జిల్లా ఎస్‌బీ ఇన్స్పెక్టర్ నారాయణ , వేమూరు సీఐ ఆంజనేయులు, వేమూరు సర్కిల్ ఎస్సైలు, ఇతర పోలీస్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# కళ్యాణం కమనీయం శ్రీ కోదండ రాముని కళ్యాణం







**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణంలోనే పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణం జరిగింది.టీటీడీ వేదంపండితులు శ్రీమాన్ గుడివర్తి అనంత వెంకట దీక్షితులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అనిల్ స్వామి, పవన్ స్వామి ఉదయం మురారిశెట్టి స్వామి ఇంటి వద్ద శ్రీ సీతారాముల ఎదుర్కోల కార్యక్రమం సాంప్రదాయ బద్దంగా ఎంతో వైభవంగా నిర్వహించారు. సేవా కాలం, పారాయణ, చతుహు స్థానా అర్చన, లక్ష్మి నరసింహ హవనము, రఘు పూర్ణాహుతి శాస్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో గుంటూరు అగ్రహారానికి చెందిన గోగంటి అప్పలాచార్యులు వారి వ్యాఖ్యానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం రథోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఈ రథోత్సవానికి మురారి శెట్టి వారు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారి శెట్టి శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, కోశాధికారి అప్పల మధు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది.

# అన్నక్యాంటీన్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**విజయవాడ,కలంకౌంటర్ :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, వీఎంసి స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మీశ శనివారం ఉదయం గాంధీజీ మహిళా కళాశాల వద్దగల అన్న క్యాంటీన్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టోకెన్ కౌంటర్‌లో ఐదు రూపాయలు చెల్లించి క్యూలో నుంచొని, అక్కడ భోజనానికి వచ్చిన ప్రజలతో వారి సమస్యలను అన్నా క్యాంటీన్ పై వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ తాము కూడా ఆహార నాణ్యత పరీక్షించేందుకు భోజనం చేశారు. అన్న క్యాంటీన్లో వసతులు ఎలా ఉన్నాయి? వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఐదు రూపాయలకి ప్రభుత్వం భోజనం అందించడం చాలా సంతోషకరమైన విషయమని వారు సగర్వంగా కేవలం 15 రూపాయలకే ఎవరి దగ్గర చేయిచాచకుండా వారి రోజుని గడుపుతున్నా మని దీనికి ప్రభుత్వానికి వాళ్ళు కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ సేవలపట్ల ప్రజల సంతృప్తిస్థాయి ప్రతీ 15 రోజులకు వృద్ధి కనపడేలా అధికారులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలి

**• జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలలో విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలి • డివిజనల్ స్థాయి అధికారులు ప్రతీ నెల సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సౌకర్యాలు పరిశీలించాలి • రబీలో 3. 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి • నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలి • రానున్న వేసవిలో జిల్లాలో ఎటువంటి త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి • డబ్బులు తీసుకుని పేదల గృహాలు నిర్మాణం పూర్తిచేయని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి • ఈనెల 20వ తేదీ వరకు కాలువలకు నీటి విడుదల పొడిగింపునకు సమావేశం తీర్మానం • రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి తో కలిసి జిల్లా సమీక్షా సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష**




**ఏలూరు/అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలపట్ల ప్రజల సంతృప్తి స్థాయి ప్రతీ 15 రోజులకు వృద్ధి కనపడేలా అధికారులు తమ పనితీరుని మెరుగుపరచుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో శనివారం జిల్లా సమీక్షా సమావేశం జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకటరాజు, చిర్రి బాలరాజు, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె.అభిషేక్ గౌడ, డిఎఫ్ఓ సందీప్ రెడ్డి, ప్రభృతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా ప్రజలకు అందించే సేవలపట్ల సంతృప్తి స్థాయిని పెంచేందుకు తీసుకోవలసిన చర్యలపై మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకువెళ్లి, ప్రజలు వాటిని సంతృప్తికరమైన రీతిలో వినియోగించుకున్నప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. అధికారులు ఈ దిశగా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సేవలపట్ల ప్రజల సంతృప్తిని తెలుసుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారన్నారు. రాబోయే జిల్లా సమీక్షా సమావేశం నాటికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయిని కనీసం 10 శాతం మేర మెరుగుపడేలా అధికారులు పనిచేయాలని, నిర్దేశించిన లక్ష్యాలలో వెనుకబడిన అధికారులపై చర్యలు తీసుకుంటానని మంత్రి హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో అద్వాన్న స్థితిలో ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మత్తులు పూర్తిచేయాలన్నారు. కొత్తగా మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రహదారులు, భవనాలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలలో డైనింగ్, ఆర్. ఓ. త్రాగునీరు యూనిట్లు, సిసి కెమెరాలు, టాయిలెట్లు, తదితర మౌలిక సదుపాయాలు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అందుకోసం రెండురోజుల్లోగా అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రతిపాదనలతో నివేదిక అందించాలన్నారు. జిల్లాలోని దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న వార్డెన్స్ కారణంగా వసతిగృహాల సేవలలో సంతృప్తి స్థాయి వెనుకబడి ఉన్నామన్న ఎమ్మెల్యే ల సూచనలతో దీర్ఘకాలంగా ఒకే ప్రదేశంలో పనిచేసే వార్డెన్స్ బదిలీకి 48 గంటలలోగా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డివిజనల్ స్థాయి అధికారులు వారిపరిధిలోని సంక్షేమ వసతి గృహాలను నెలకు ఒకసారి తప్పనిసరిగా సందర్శించి సౌకర్యాలను పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని బస్టాండ్ లలో ప్రయాణీకులకు ఆర్.ఓ ప్లాంట్ల ద్వారా త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, వేసవి దృష్ట్యా బస్టాప్ లలో కూడా త్రాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వేసవిలో జిల్లాలోని కాలువలు, డ్రైన్లలో తూడు, పూడికతీత వంటి నిర్వహణ పనులు చేపట్టి శివారు భూములకు సైతం సాగు,త్రాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలు తప్పనిసరిగా పరిగణనలోనికి తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎల్.ఎల్.ఆర్. డ్రైవింగ్ లైసెన్స్ జారీ కోసం జిల్లాలోని ప్రతీ నియోజకవర్గంలో ఈనెల 15వ తేదీ నుండి ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. అదేరోజు డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రబీలో ధాన్యం రవాణాకు ఎటువంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. రబీలో 3. 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిలాల్లోని కొన్ని గ్రామాలలో 3 కిలోమీటర్లకు మించిన దూరంలో రేషన్ షాపులు ఉన్నాయని, అలాంటి ప్రాంతాలలో సబ్ రేషన్ దుకాణం ఏర్పాటును పరిశీలించారు. జిల్లాలో పనితీరులో వెనుకబడిన 45 రేషన్ దుకాణాల డీలర్లు తమ పనితీరును మెరుగుపరచుకోకపోతే వారిని తొలగించాలని మంత్రి జాయింట్ కలెక్టర్ ను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ శాఖాధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. వంట గ్యాస్ పంపిణీలో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ముందుస్థానంలో ఉందన్నారు. ప్రతీరోజు గ్యాస్ బుకింగ్స్, అందించిన వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలిసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డబ్బులు తీసుకుని పేదల గృహాలు నిర్మాణం పూర్తిచేయని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతులు సాగు చేసే విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుత వేసవిలో జిల్లాలో త్రాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 20 వ తేది వరకు గోదావరి నుండి కాలువల ద్వారా సాగు, త్రాగు నీరు సరఫరా కు గడువును పొడిగించేలా ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది. ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో అదనపు సర్వీసులు ఏర్పాటుచేయాలన్నారు. ద్వారకా తిరుమలకు శని, ఆదివారాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ రోజులలో అదనపు సర్వీసులు ఏర్పాటుచేయాలన్నారు. నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మే నెలలో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు నగరంలో డ్రైన్ల పూడికతీత కార్యక్రమం చేపట్టాలన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com